

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల
జిల్లా వార్తలు 5
మంగళవారం 23 జూలై 2024





- స్త్రీ నిధి రుణం పరిమితి పెంపు
- సరళీకృతంగా రుణాల మంజూరుకు ప్రణాళికలు సిద్ధం
- కూటమి పాలనలో సీఎం చంద్రబాబు వరాల జల్లు
- అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే మహిళా సాధికారతకు కృషి
- డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం
- వైసీపీ పాలనలోని అక్రమాలకు చెక్ పెట్టేలా చర్యలు
- నంద్యాల జిల్లాలో రుణ మంజూరు లక్ష్యం రూ.125 కోట్లు

డ్వాక్రాకు పెద్దపీట

నంద్యాల టౌన్, జూలై 22 :

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి గతంలో తాను తెచ్చిన డ్వాక్రా సంఘాలను తిరిగి పునరుద్ధరించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. పొదుపు మహిళల శ్రేయోభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వడి వడిగా అడుగులు వేస్తోంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో స్వయం సహాయక సంఘాలకు సరైన రీతిలో ప్రోత్సాహం లభించలేదన్న విషయం అందరికీ తెలిసిందే. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని మహిళా సంక్షేమ, అభ్యున్నతికి పెద్దపీట వేస్తామంటూ టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి ప్రజలకు హామీ ఇచ్చింది. ఈ మేరకు అధికారంలోకి వచ్చిన నెల రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వైసీపీ పాలనలో కేవలం ఫొటోలకే పరిమితమైన డ్వాక్రా రుణాలు కూటమి ప్రభుత్వం అక్రమాలకు తావు లేకుండా సకాలంలో రుణాల మంజూరుకు కార్యాచరణ సిద్ధం చేసింది.

స్త్రీ నిధి ద్వారా రుణ సాయం పెంపు



చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం స్వయం ఉపాధి డ్వాక్రా సంఘాల మహిళలకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలవడానికి చర్యలు ప్రారంభించింది. వెలుగు ద్వారా అర్హులైన సభ్యులకు రుణాలు అందించడానికి కార్యాచరణ సిద్ధం చేయడమే కాకుండా క్షేత్రస్థాయిలో అమలుకు కసరత్తు వేగవంతం చేయడం విశేషం. గత వైసీపీ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు రూ.3.5 లక్షలు మాత్రమే రుణం ఇచ్చేది. అయితే ఈ మొత్తాన్ని పెంచుతూ పరిమితిని రూ.5 లక్షలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో పొదుపు సంఘాల్లో జోష్ నెలకొంది. ఒక్కో గ్రూపులో ఉన్న ఏడుగురు సభ్యుల సంఖ్యను 10కి పెంచడం కూడా కలిసి వచ్చే అవకాశమని మహిళలు భావిస్తున్నారు. ఒక్కో సభ్యురాలు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు పొందే అవకాశం ఉంది. గతంలో రుణం తీసుకున్న వారికి రెండేళ్ళ వరకు మరెలాంటి అవకాశం ఉండేది కాదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం మధ్యలో రూ.లక్ష తీసుకునే వెసులుబాటు కల్పించారు.


అక్రమాలకు చోటు లేకుండా

వైసీపీ ప్రభుత్వ హయంలో పలు చోట్ల పొదుపు రుణాల మంజూరులో అక్రమాలు, అవకతవకలు కోకొల్లలుగా జరిగాయి. రుణం చెల్లింపుల విషయంలో కూడా కొంత మంది చేతివాటం ప్రదర్శన కారణంగా పొదుపు సొమ్ము జమ చేయడంలో అక్రమాలకు పాల్పడిన సంఘటనలు జరిగాయి. వీటన్నింటికీ కూటమి ప్రభుత్వం చెక్ పెడుతూ ఎక్కడా అవకతవకలకు ఆస్కారం లేకుండా నేరుగా స్వయం సహాయక సంఘాల్లో సభ్యుల ఖాతాల్లో నగదు జమ చేయాలని నిర్ణయించింది. జగన్ ప్రభుత్వ హయంలో బ్యాంక్ లింకేజీ రుణాల కోసం సభ్యులంతా రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితిపై కూడా కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి మహిళలకు సరళతరమైన రీతిలో రుణాలు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. అన్ని పత్రాలు ఉంటే కేవలం 24 గంటల వ్యవధిలోనే గ్రామ సంఘ సహాయకుల ద్వారా రుణం మంజూరు చేసి సభ్యుల ఖాతాల్లో జమ చేయనున్నారు. నగదు రహిత లావాదేవీలను నిర్వహించడానికి వీఓఏలకు పేటీఎం పరికరాలను అందించనున్నారు. వీటి ద్వారా పొదుపు మహిళలు తాము తీసుకున్న రుణాన్ని నేరుగా చెల్లించే అవకాశం కలుగుతుంది.

ఉన్నతి కింద ఎస్సీ, ఎస్టీలకు రుణాలు

వైసీపీ ప్రభుత్వ హయంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు రుణాలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు చేయూతను అందించడంలో భాగంగా ఉన్నతి పథకంలో వడ్డీ లేకుండా రుణాలు మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వెలుగు, సామాజిక పెట్టుబడి నిధి, అంతర్గత రుణాలను మంజూరు చేసేందుకు గ్రామాల వారీగా సంఘాలు, సభ్యుల వివరాలను సేకరించి రుణ సాయం అందించేందుకు అధికార యంత్రాంగం చక చకా ముందుకు కదులుతున్నది.

సూపర్ -6 పథకాలు అమలుకే ప్రాధాన్యత



జగన్ పాలనలో ఐదేళ్ళ కాలంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. సంక్షేమ పాలన గాడితప్పింది. రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ కాలరాచారు. ఎన్నికల సందర్భంగా సూపర్ -6 పథకాలను అమలు చేస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ప్రజలు నమ్మి కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించారు. ప్రజలు ఇచ్చిన తీర్పుకు కృతజ్ఞతగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొద్ది రోజుల వ్యవధిలోనే ఎన్నికల హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. డ్వాక్రా సంఘాల సృష్టికర్తగా చంద్రబాబు గతంలో మహిళా సాధికారతకు పెద్ద పీట వేశారు. దాన్ని వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసింది. తిరిగి మహిళా సాధికారత కోసం ప్రభుత్వం కృతనిశ్చయంతో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకొని మహిళా సంక్షేమానికి దారులు వేస్తున్నది.

- ఎన్ఎండీ ఫరూక్,
రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయ శాఖా మంత్రి, నంద్యాల

స్త్రీనిధి-ఆంధ్రప్రదేశ్
మహిళలే ముందు



గ్రేడింగ్ ఆధారంగా రుణాలు

మహిళా సంఘాల అభ్యున్నతే లక్ష్యంగా చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం స్వయం ఉపాధి సంఘాలను బలోపేతం చేసేందుకు గ్రేడింగ్ ఆధారంగా రుణాలు అందించేందుకు రంగం సిద్ధమైంది. సంఘాల పని తీరు ఆధారంగా ఏ,బీ,సీ,డీ గ్రేడ్లు కేటాయిస్తారు. ఏ - గ్రేడ్‌కు రూ.75 లక్షలు, బి - గ్రేడ్‌కు రూ.65 లక్షలు, సీ - గ్రేడ్‌కు రూ.55 లక్షలు, డీ - గ్రేడ్‌కు రూ.45 లక్షల వరకు రుణాలు అందించనున్నారు. రుణం తీసుకున్న సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే రుణం మొత్తం మాఫీ చేయనున్నారు. వ్యవసాయం, చిరు వ్యాపారం, కుల వృత్తులు చేసేవారికి స్త్రీ నిధి కింద 145 రకాల జీవనోపాధులను గుర్తించి రుణాలు ఇచ్చేందుకు కసరత్తు జరుగుతోంది.

నంద్యాల జిల్లాలో లక్ష్యం రూ.125 కోట్లు

నంద్యాల జిల్లాలో మహిళా సాధికారతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రూ.125 కోట్లు మహిళలకు రుణ సాయం అందించాలని కార్యాచరణను సిద్ధం చేసింది. జిల్లాలో మొత్తం 19,975 మంది సభ్యులకు గ్రేడింగ్‌ల వారీగా రుణాలు అందించే ప్రక్రియ ఆరంభమైంది. డ్వాక్రా సంఘాల్లోని ప్రతి సభ్యురాలికి కనిష్ఠంగా రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.లక్ష వరకు ఇవ్వనున్నారు. రూ.50 వేల రుణం తీసుకుంటే 24 వాయిదాల్లో, రూ.లక్ష తీసుకుంటే 36 నెలల్లో చెల్లించాల్సి ఉంది. బీమా సౌకర్యం అమలులో భాగంగా ఒక్కో సభ్యురాలు రూ.400 చెల్లించాల్సి ఉంటుంది.

మనసుపెట్టి సమస్యలు పరిష్కరించండి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జి. రాజకుమారి

- కలెక్టర్ జి. రాజకుమారి
- పీజీఆర్ఎస్‌కు 201 ఫిర్యాదులు

నంద్యాల (కల్చరల్), జూలై 22: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన విన్నతులను మనసుపెట్టి పరిష్కరించాలని కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో పాల్గొని జిల్లా నలుమూలల నుంచి ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ మండల సర్వేయర్లు, వీఆర్వోల పైన అత్యధికంగా ఫిర్యాదులు రావడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 201 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలని అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.


ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 115 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, జూలై 22 : నంద్యాల బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి 115 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ నేరుగా వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, తాలుకా ఇన్‌స్పెక్టర్ దస్తగిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయానికి భారీగా ఇన్‌ఫ్లో



శ్రీశైలం డ్యామ్

శ్రీశైలం, జూలై 22: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి సోమవారం భారీగా ఇన్‌ఫ్లో నమోదయింది. జూరాల జలాశయం నుంచి 1,74,717 క్యూసెక్కులు వరద నీరు దిగువకు విడుదల చేశారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి 1,09,814 క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతుంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 832.50 అడుగులు, జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీ.ఎమ్.సీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 52.1476 టీ.ఎమ్.సీలుగా నమోదయింది. జలాశయం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో ఎలాంటి విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు.

కడప వరకే డెమో రైలు

నంద్యాల (నూనెపల్లె), జూలై 22: నంద్యాల - కడప మీదుగా రేణిగుంట వరకు వెళ్లాల్సిన 07284 నంబరు గల డెమో రైలు కడప వరకే వెళుతుందని నంద్యాల రైల్వే స్టేషన్ మేనేజర్ దొరస్వామి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుత్తి- రేణిగుంట రైలు మార్గంలో ఆధునికీకరణ పనులు జరుగుతుండటంతో జూలై 22వ తేది నుంచి 26 వరకు కడప వరకు మాత్రమే వెళుతుందని చెప్పారు. కడప నుంచి 07285 నంబరు గల డెమో నంద్యాలకు తిరిగి ప్రయాణిస్తుందని, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

మహానందిలో ఆలయ సిబ్బంది అంతర్గత బదిలీలు

మహానంది, జూలై 22: మహానంది ఆలయంలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ ఉద్యోగులతో పాటు పాటు ఏజెన్సీ ప్రతిపాదికన విధులు నిర్వహించే ఉద్యోగులను బదిలీ చేస్తూ ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేసారు. ఇందులో ఆలయంలో ఉదయం వేళల్లో టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌గా రాచమల్ల శ్రీనివాసులు, మధ్యాహ్నం శశిధర్‌రెడ్డితో పాటు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ చల్లగాలి లక్ష్మయ్య, ప్రసాదాల పోటు పడితరం ఇన్‌చార్జి నాగమల్లయ్య, శివాలయానికి రామశివ, వసతి గదుల ఇన్‌చార్జ్‌లుగా ఉదయం ఈశ్వరయ్య, రాత్రి ఎర్రయ్యలను బదిలీ చేసినట్లు తెలిపారు. వారికి కేటాయించిన బదిలీ స్థానాల్లో సిబ్బంది విధుల్లో చేరాలని ఈవో ఆదేశించారు.

రంగు మారిన పరిమళ ప్రసాదం



తెలుపు రంగులోకి మారిన పరిమళ ప్రసాదం

మంత్రాలయం, జూలై 22: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం భక్తులకు అందించే పరిమళ ప్రసాదం రంగు మారింది. ద్వాదశి నుంచి ఆగస్టు 17వ తేదీ వరకు భక్తులకు తెలుపు రంగు పరిమళ ప్రసాదం అందజేస్తున్నట్లు ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి తెలిపారు. రాఘవేంద్రస్వామి మఠంలో కాషాయ రంగులో ఉన్న పరిమళ ప్రసాదాన్ని గత రెండు రోజుల నుంచి ఆగస్టు 16వ తేదీ వరకు తెలుపు రంగులోనే పరిమళ ప్రసాదం ఇస్తారని అన్నారు.

20 పడకలతో నూతన క్యాజువాల్టీ ప్రారంభం

- 28 వెంటిలేటర్లతో ఏఎంసీ, క్యాజువాల్టీల్లో చికిత్స
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి



డా. రాంశివ నాయక్‌తో కలిసి నూతన క్యాజువాల్టీని ప్రారంభిస్తున్నడా.సి. ప్రభాకర్ రెడ్డి

కర్నూలు(హస్పిటల్), జూలై 22: కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో 26 పడకలతో అత్యవసర రోగుల కోసం నూతన క్యాజువాల్టీని సోమవారం ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ డా. రాంశివ నాయక్‌తో కలిసి వైద్యశాల సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల నుంచి అత్యవసర రోగులు ఎక్కువగా వస్తుంటారని, ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల తర్వాత రోడ్డు ప్రమాద బాధితులు కూడా ఎక్కువ మంది వస్తుంటారని, వీరందరికీ వైద్యం అందించడం డాక్టర్లకు కష్టంగా మారిందని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కొత్త కలెక్టర్‌ను సంప్రదించి 20 పడకలతో అదనపు క్యాజువాల్టీని ఏర్పాటు చేశామన్నారు. క్యాజువాల్టీలో 20 పడకలతో ఆక్సిజన్ సౌకర్యంతోపాటు ఐదు బెడ్లకు వెంటిలేటర్, మానిటర్లు సదుపాయం, మరో మూడు బెడ్లతో సిబ్బందికి చికిత్స అందేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు శారద, సుబ్రహ్మణ్యం, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ ఇక్బాల్ హుశేన్, ప్రొఫెసర్లు లక్ష్మీబాయి, రాజశేఖర్, విద్యాసాగర్, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి పాల్గొన్నారు.

- **ఏఎంసీలో 12 ఆర్ఐసీయూ పడకల ఏర్పాటు:** బ్లడ్ బ్యాంకు ఆవరణలోని ఏఎంసీలో 12 పడకలతో కొత్త ఆర్ఐసీయూ వార్డును అనస్థీషియా ఇన్‌చార్జి హెచ్‌వోడీ డా. కొండారెడ్డి, మెడిసిన్ హెచ్‌వోడీ డా.ఇక్బాల్ హుశేన్‌తో కలిసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఏఎంసీలో వెంటిలేటర్ల బెడ్ కోసం నిత్యం రోగులు ఇబ్బందులు పడుతున్నారని, రిస్పిరేటరీ ఇన్‌సెంటివ్ కేర్ యూనిట్‌లో కొత్తగా 12 వెంటిలేటర్లు, 12 మానిటర్లతో ఐసీయూ యూనిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్లు డా.లక్ష్మీబాయి, డా.రాజశేఖర్, ఏఎంసీ ఇన్‌చార్జి డా.విద్యాసాగర్, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి పాల్గొన్నారు.

ఉల్లి నాటే వేళ

- వెంకటగిరిలో ఊపందుకున్న నాట్లు
- రైతుల ఆశలకు ఊపిరి పోసిన వర్షాలు
- కూలీలకు భలే డిమాండ్
- ఇతర గ్రామాల నుంచి కూలీల దిగుమతి

కోడుమూరు (రూరల్), జూలై 22:

ఆ గ్రామ రైతులు ఖరీఫ్‌లో ఉల్లి తప్ప మరో పంట ఆలోచించరు. లాభ నష్టాలతో సంబంధం లేకుండా గత కొన్నేళ్లుగా ఉల్లినే నమ్ముకున్నారు. పంట సాగు కోసం ఖర్చుకు వెనుకాడరు. సొంత పొలం లేకపోతే కౌలుకు తీసుకుని మరీ సాగు చేస్తారు. తల్లి చేయని మేలు ఉల్లి చేస్తుందని, ఉల్లి సాగు చేస్తే నష్టాలు ఉండవని వెంకటగిరి రైతులు అంటారు. ఈ ఒక్క గ్రామంలోనే ఏటా 1500 ఎకరాల్లో పైగా ఉల్లి సాగు చేస్తారు. దీనిని బట్టి ఈ గ్రామ రైతులు ఉల్లి పంటను ఎంతగా నమ్ముకున్నారో అర్థం చేసుకోవచ్చు.

మరోచోట నారు పెంపకం

వెంకటగిరిలో నల్లరేగడి పొలాలే అధికం. బోరుబావులు పెద్దగా లేవు. వర్షంపైనే రైతుల ఆశలన్నీ. ఒక్క పదునైన వాన కురిస్తే సుమారు 20 రోజుల వరకు పంటకు ఇబ్బంది ఉండదు. అయితే బోరుబావులు పెద్దగా లేకపోవడంతో రైతులు నీటిలభ్యత ఉన్న రైతుల పొలాల్లో నారు పెంచుకుంటున్నారు. ఇందు కోసం ఎర్రదొడ్డి, వర్కూరు, ప్యాలకుర్తి తదితర గ్రామాల్లో బోరు బావులు ఉన్న చోట పొలంలో నారు పెంచుతున్నారు. ఇందు కోసం పడి ఉల్లి విత్తనాలకు రూ వెయ్యి చెల్లిస్తున్నారు. పొలం యజమాని నీటి తడులు అందిస్తుండగా, నారు పెంచుకున్న రైతు మందులు, కలుపులు చూసుకోవాలి. 40 రోజుల క్రితం ఉల్లినారు పోసుకున్న రైతులకు నాటు సమయం రాగానే తుఫాన్ రూపంలో రెండురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు పట్టరాని సంతోషంతో ఉల్లి నాట్లలో బిజీగా మారారు.

కూలీలకు భలే డిమాండ్: వెంకటగిరిలో ఉల్లినాటు పనులు మొదలు కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి కూలీలను దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. కల్లపరి, బైనదొడ్డి, వర్కూరు, లద్దగిరి, ప్యాలకుర్తి, కున్నూరు, మాచాపురం, కోడుమూరు, గోరంట్ల, అమడగుంట్ల తదితర గ్రామాల నుంచి కూలీలను రప్పిస్తున్నారు. కూలీలకు రానుపోను చార్జీలను కలుపుకుని రూ 400 చెల్లిస్తున్నామని ఓ రైతు తెలిపాడు. రైతులు నాటు పనులకు పూనుకోవడంతో పొలాల్లో కూలీల సందడి ఏర్పడింది. కూలీలను తరలించిన వాహనాలు పొలాలకు సమీపంలో నిలిపి డ్రైవర్లు కాలక్షేపం చేస్తున్నారు.


ఉల్లినాటు వేస్తున్న కూలీలు


నారుకట్టలు సిద్ధం చేస్తున్న దృశ్యం


ప్యాలకుర్తి వద్ద పెంచుకున్న నారుమడులు

పని దొరుకుతుంది



వెంకటగిరిలో ఉల్లినాటు పనులు మొదలయ్యాయి. దాదాపు రెండు వారాలపాటు కూలీలకు పనులు దొరుకుతాయి. వాహనంలో రానుపోను చార్జీలు రైతులే భరిస్తున్నారు. మాగ్రామం నుంచి ఏటా ఉల్లినాటు పనులకు వెంకటగిరి వస్తున్నాం.

-మార్తమ్మ, కూలీ కల్లపరి

ఐదు ఎకరాల్లో ఉల్లిసాగు



ఖరీఫ్ సీజన్ కింద గతంలో పత్తి సాగు చేసేవాళ్లం. అయితే గులాబీ పురుగు దాడి పెరగడంతో విరమించుకున్నాం. సుమారు పదేళ్లకు పైగా ఉల్లి సాగు చేస్తున్నా. ప్యాలకుర్తి వద్ద నారు పెంచుకున్నా. ఇందుకు రూ 8 వేలు ఖర్చు అయ్యింది. ఇప్పుడు ఐదు ఎకరాల్లో నాటుకు మాత్రమే రూ. లక్ష అవుతోంది. నారు చేతికందిన సమయంలో వర్షం రావడం శుభసూచికం.

- శ్రీనివాసులు, వెంకటగిరి

కౌలుకు తీసుకున్నా



గత నాలుగేళ్లుగా మూడు ఎకరాలను కౌలు చేస్తున్నా. ఎకరా రూ 15 వేలు కౌలు. ఏటా ఉల్లి పంట వేస్తున్నా. పంటలో లాభ, నష్టాలను చవిచూస్తున్నా. అయినా ఉల్లిని వదిలిపెట్టలేకున్నాం. లింగందిన్నె నుంచి కూలీలను రప్పించి నాట్లు వేయిస్తున్నా.

-చిన్నమద్దిలేటి, వెంకటగిరి

సీఎంను కలిసిన ఎమ్మెల్యే కోట్ల

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని వినతి

డోన్, జూలై 22: అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సీఎం చంద్రబాబును సోమవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కలిసి పలు వినతులను అందజేశారు. ఎన్డీయే ఎమ్మెల్యేల సమావేశం అనంతరం సీఎం చంద్రబాబును ప్రత్యేకంగా ఎమ్మెల్యే కోట్ల కలిశారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరారు. డోన్ నియోజకవర్గంలో రైతాంగాన్ని ఆదుకోవడానికి హంద్రీ నీవా ప్రాజెక్టు నుంచి చెరువులకు నీళ్లు నింపాలని కోరారు. డోన్ ప్రాంతంలో ఎలాంటి నీటి పారుదల సౌకర్యాలు లేవని, చెరువులకు నీళ్లు రైతులకు సాగునీరు అందించేలా చూడాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విన్నవించారు. అదే విధంగా డోన్ నియోజకవర్గంలోని వాటర్ గ్రిడ్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని సీఎం చంద్రబాబును కోరారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలని ఎమ్మెల్యే కోట్ల విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎంను కోరినట్లు చెప్పారు. దీనికి సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ ఆత్మహత్య

రుద్రవరం, జూలై 22 : మండలంలోని నాగులవరం గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి (27) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ బాలన్న తెలిపారు. ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ తెలిపారు.

రూటు మార్చిన చిరుత

- పార్వతీపురం సమీపంలో సంచారం
- భయాందోళనలో కాలనీ ప్రజలు

మహానంది, జూలై 22: మహానంది శివారు ప్రాంతంలోని పార్వతీపురం కాలనీకి అత్యంత సమీపంలో ఆదివారం రాత్రి చిరుతపులి సంచరించింది. నల్లమల నుండి చిరుతపులి ఆకస్మాత్తుగా వచ్చి పంది పిల్లను నోట కర్చుకొని తిరిగి అడవిలోకి వెళ్లడం చూసిన కాలనీ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గతంలో మహానంది ఆలయం, ఈశ్వర్‌నగర్ కాలనీ, దేవస్థానం ఉద్యోగుల కాలనీ పరిసరాల్లో తిరిగే చిరుతపులి ఈసారి రూటు మార్చింది. అటవీశాఖ అధికారులు చిరుతపులి వల్ల గ్రామాల్లో ప్రాణ నష్టం జరుగకముందే ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

ఆలయంలో చోరీ

పగిడ్యాల, జూలై 22: మండల పరిధిలోని తూర్పు ప్రాతకోటలోని నాగేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం చోరీ జరిగింది. ఆలయానికి వేసిన తాళాలను మధ్యాహ్న సమయంలో బద్దలుకొట్టి దుండగులు లోపలికి ప్రవేశించి పురాతన గంటను తీసుకెళ్లారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం దేవాలయానికి వచ్చిన పూజారి సోమయ్య తాళం పగలగొట్టి ఉండటంతో అనుమానం వచ్చి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సోమవారం ముచ్చుమర్రి పోలీసులు వచ్చి ఆలయ సమీపంలోని సీసీ కెమెరాల ఆధారంగా ఇద్దరు యువకులు చోరీ చేసినట్లు గుర్తించారు. గంట విలువ రూ. 20 వేల విలువ ఉంటుందని, పోలీసులకు ఫిర్యాదు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు.

వజ్రం లభ్యం

తుగ్గలి, జూలై 22: వ్యవసాయ పనులు చేసుకుంటున్న గిరిజన మహిళకు వజ్రం లభ్యమైంది. సోమవారం మండల పరిధిలోని మిద్దెతండాలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న గిరిజన మహిళకు వజ్రం లభ్యమైంది. జొన్నగిరికి చెందిన వజ్రాల వ్యాపారి రూ.1.10 లక్షకు దీన్ని కొన్నట్లు సమాచారం.

మహిళా వ్యవసాయ కూలీలకు అస్వస్థత

ఆళ్లగడ్డ, జూలై 22: ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని ఎస్. లింగందిన్నె పంట పొలాల్లో పని చేస్తున్న సుమారు 14 మంది మహిళా వ్యవసాయ కూలీలు తీవ్ర అస్వస్థతకు సోమవారం గురయ్యారు. వీరంతా మధ్యాహ్నం భోజనం అనంతరం పొలంలో పని చేస్తుండగా ఉన్నపళంగా వాంతులు, విరేచనాలకు గురి కావడంతో పొలం యజమాని రామకృష్ణారెడ్డి చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరికి మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ సీఐ రమేష్‌బాబు పంట పొలాల వద్దకు వెళ్లి అస్వస్థతకు గురి కావడంపై విచారణ చేపట్టారు. కూలీలంతా ఆళ్లగడ్డ పట్టణంలోని రామలక్ష్మీకొట్టాల, ఆచారి కాలనీ వాసులని ఆయన చెప్పారు.

విభిన్న ప్రతిభావంతులకు ఓపీ కౌంటర్



ఓపీ కౌంటరు నెంబరు 5ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ సీనియర్ అసిస్టెంట్ వెంకట నారాయణ

కర్నూలు(హాస్పిటల్), జూలై 22: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఓపీ కౌంటర్ (నెంబర్.5)ను సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి విభిన్న ప్రతిభావంతుడైన సీనియర్ అసిస్టెంట్ బి. వెంకట నారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విభిన్న ప్రతిభావంతులకు అసౌకర్యం కలగకుండా చికిత్స అందించేందుకు వీలుగా ఓపీ కౌంటర్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో మెడిసిన్ ప్రొఫెసర్లు డా. రాజశేఖర్, డా. లక్ష్మిబాయి, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం

రూ.4.57 లక్షలు లూటీ చేసిన సైబర్ నేరగాళ్లు

గడివేముల, జూలై 22: ఖాతాదారుడి సొమ్మును సైబర్ నేరగాళ్లు తస్కరించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని తిరుపాడు గ్రామానికి చెందిన దర్గస్వామికి పోలూరులోని యూనియన్ బ్యాంకులో ఖాతా ఉంది. దర్గస్వామి గ్రామంలో రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసి బడా వ్యాపారులకు విక్రయిస్తుంటాడు. ఈనెల 18న దర్గస్వామికి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి కాల్ వచ్చింది. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, ఖాతా వివరాలు తెలపమని అడుగగా దర్గస్వామి రాంగ్ కాల్ అని కాల్ కట్ చేశాడు. అనంతరం అతడి సెల్‌కు ఓటీపీలు వచ్చాయి. దీంతో ఆయనకు అనుమానం వచ్చి మరుసటి రోజు బ్యాంకును సంప్రదించగా తన ఖాతాలో 18వ తేదీన కుమార్ పేరు మీద రూ.49 వేలు, రూ.99 వేలు, రూ.50 వేలు, రాజు పేరుమీద రూ.50 వేలు, ఎగ్జాంపుల్ మీద రూ.99 వేలు, రూ.99 వేలు, రూ.10 వేలు చొప్పున రూ.4.57 లక్షలు నగదు బదిలీ అయినట్లు తెలిసింది. బ్యాంకు మేనేజర్ నుంచి వివరాలు తీసుకొని సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

బెంగళూరుకు ఫెయిల్యూరు ఈవీఎంలు

కలెక్టర్ జి. రాజకుమారి

నంద్యాల (కల్చరల్), జూలై 22: సార్వత్రిక ఎన్నికల కోసం వచ్చిన ఈవీఎంలలో ఫెయిల్యూర్ అయిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను సోమవారం బెంగళూరుకు తరలిస్తున్నామని కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం టెక్కె మార్కెట్ యార్డులో భద్రపరిచిన ఈవీఎం గోడౌన్ ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఫెయిల్యూర్ అయిన ఈవీఎంలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ సాంకేతిక లోపం వల్ల పనిచేయని ఈవీఎంలు, ట్రైనింగ్లో డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు, మాక్‌పోల్ డిఫెక్ట్ వచ్చిన ఈఎంలు(111), కమీషనింగ్‌లో డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు(194), రిజర్వులో ఉన్న ఈవీఎంలు(51), ఫస్ట్ లెవల్ చెక్‌లో పనిచేయని ఈవీఎంలు(78), ట్రైనింగ్‌లో డిఫెక్ట్ వచ్చిన ఒక ఈవీయం.. మొత్తం 435 ఈవీఎంలను స్కాన్ చేసి బెల్ కంపెనీ, బెంగుళూరుకు తరలిస్తున్నట్లు ఆమె తెలిపారు.

వెయ్యి లీటర్లకు ఎంత బ్లీచింగ్ కలపాలి?

పగిడ్యాల ఈవోఆర్డీని ప్రశ్నించిన కలెక్టరు

పగిడ్యాల, జూలై 22: గ్రామాల్లోని ఒవర్ హెడ్ ట్యాంకులలోని వెయ్యి లీటర్ల నీటిలో ఎంత బ్లీచింగ్ పౌడరు కలుపాలని కలెక్టరు రాజకుమారి పగిడ్యాల ఈవో ఆర్డీ నాగేంద్రమయ్యను ప్రశ్నించారు. పగిడ్యాల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. కలెక్టరు రాజకుమారి పగిడ్యాల ఈవోఆర్డీని వెయ్యి లీటర్ల నీటిలోఎంత బ్లీచింగ్ కలుపుతారని ప్రశ్నించారు. దీనికి ఆయన మూడు గ్రాములు అని సమాధానం చెప్పారు. ఈవో ఆర్డీ చెప్పిన సమాధానంపై ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కవిరాజ్, తహసీల్దార్ నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్ బొమ్మ తీసేశారు..

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ

కొలిమిగుండ్ల, జూలై 22: గత వైసీపీ పాలనలో విద్యార్థుల బ్యాగులు, బెల్టులు, నోటు పుస్తకాలు చివరకు పిల్లలకు పంపిణీ చేసే చిక్కీలపై కూడా అప్పటి సీఎం జగన్ బొమ్మలు, పేర్లు ముద్రించేవారు. గత నెలలోనే టీడీపీ ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను అందించినప్పటికీ బ్యాగులు, బెల్టులు ఇతర సామగ్రిపై గత ముఖ్యమంత్రి జగన్ పేరు, ఫొటోలను తొలగించడానికి పంపిణీ ఆలస్యమైంది. చివరికి జగన్ బొమ్మలను తొలగించిన సామగ్రి జిల్లాకు చేరడంతో గత నాలుగైదు రోజులుగా పాఠశాలల్లో విద్యార్థులకు వీటిని పంపిణీ చేస్తున్నారు.


బొమ్మలు లేకుండా వచ్చిన బ్యాగులు, బెల్ట్స్, పుస్తకాలు

ఆదోని కొండల్లో వైసీపీ దొంగలు

- రాత్రింబవళ్లు గరుసు తరలింపు
- రెండు రోజుల క్రితం గరుసు లారీ బోల్తా
- వైసీపీ నాయకుడి పరిస్థితి విషమం


ఖాళీ అయిన కొండలు

ఆదోని రూరల్, జూలై 22 : ఆదోనికి కవచంగా ఉండే కొండల్లో వైసీపీ నాయకులు సహజ సంపదలను దొరికికాడికి దోచుకుంటున్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ కొండలను వైసీపీ నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తన అనుచరులకు ఆదోని నలువైపులా ఉన్న కొండలను సొంత ఆస్తిలా పంచి పెట్టారనే విమర్శ ఉంది. వారు కొండలను పిండి చేసి రాళ్లతోపాటు ఎర్రమట్టిని (గరుసు) అమ్ముకున్నారు. టీడీపీ అధికారం చేపట్టిన తర్వా త కూడా వైసీపీ నాయకుల గరుసు దందా ఆగడం లేదు. ఇందులో భాగంగా, రెండు రోజుల క్రితం ఆదోని మండలం ఆరేకల్లుకు చెందిన సాయిప్రసాద్‌రెడ్డి అనుచ రుడు గంగిరెడ్డి తన ఏపి 31టిఏ 0724 గల లారీలో రూరల్ పరిధిలోని కొండాపురం కొండల్లో గరుసును తరలి స్తుండగా లారీ బోల్తా పడింది. అక్కడే ఉన్న ఆయన అనుచరులు లారీ కింద పడ్డ గంగిరెడ్డిని రక్షించి ఆదోని లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విష మంగా ఉండడంతో కర్నూలుకు తరలించి అక్కడ గంగి రెడ్డికి చేయి, కాళ్లకు సంబంధించి ఆపరేషన్లు కూడ చేయిం చినట్లు వైసీపీ నాయకులు తెలిపారు. ఇదిలా ఉండగా, సహజ సంపదను కాపాడాల్సిన అధికారులు, ప్రజాప్రతిని ధులు మౌనంగా ఉండడం పట్ల ఆదోని ప్రజలు విమర్శిస్తున్నారు.


బోల్తా పడ్డ వైసీపీ నాయకుడి గరుసు లారీ

దొంగ దొరికాడు..

- దొంగను ఇంట్లో పెట్టి తాళం వేసిన స్థానికులు.. పోలీసులకు అప్పగింత
- కోసిగిలో అర్ధరాత్రి ముగ్గురు దొంగల హల్‌చల్

కోసిగి, జూలై 22: గత మూడు రోజులుగా తాళం వేసి ఉన్న ఇంటిని గమనించిన ముగ్గురు దొంగలు సోమవారం తెల్లవారుజామున తాళాలు పగులకొట్టి ఇంట్లోకి దూరారు. ఇద్దరు దొంగలు బయట కాపలా కాస్తుండగా.. ఓ దొంగ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. అయితే పక్క కాలనీవాసులు ఇది గమనించడంతో బయట ఉన్న ఇద్దరు దొంగలు పరారయ్యారు. ఇంట్లో ఉన్న ఓ దొంగ మాత్రం దొరికాడు. మండల కేంద్రమైన కోసిగిలోని 4వ వార్డు హనుమాన్ నగర్‌లో ఈ ఘటన జరిగింది. కాలనీకి చెందిన టీడీపీ మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ సోదరుడు తోవి వెంకటేశ్ మూడు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున ఆ ఇంట్లో దొంగతనం జరుగుతున్నట్లు స్థానికులు గమనించి ఒక దొంగను ఇంట్లోనే బంధించారు. నిందితుడు కోసిగిలోని 9వ వార్డు రామక్కమ్మవ్వ కాలనీకి చెందిన గంధాలం భీమయ్య అని తేలింది. కాలనీవాసులు తోవి రామకృష్ణ కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కానిస్టేబుల్ ఆ దొంగను కస్టడిలోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పరారైన ఇద్దరి దొంగలు వెంకటేశ్, నాగరాజు అని భీమయ్య తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కోసిగిలో ఇంట్లో ఉన్న దొంగకు ఇంటి బయట తాళం వేసిన స్థానికులు

వైసీపీ నాయకుల నిర్వాకం

- కాలువలు లేకుండా సీసీ రోడ్డు
- స్థానికులు చందాలు వేసుకుని గుంతలను పూడ్చుకున్న వైనం


మట్టితో గుంతలు పూడ్చుకుంటున్న కాలనీవాసులు

మద్దికెర, జూలై 22: స్థానిక సాయినగర్ కాలనీలో ఎన్నికల ముందు వైసీపీ నాయకులు మురుగు కాలువలు వేయకుండా సీసీ రోడ్డును వేశారు. సైడు కాలువలు లేకపోవడం వల్ల గత మూడు రోజుల నుంచి అడపా దడపా కురిసిన వర్షాలకు రోడ్డు చివరి భాగంలో మోకాళ్ల లోతు నీరు నిల్వగా చేరి గుంతలు పడ్డాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు చందాల ద్వారా నగదు పోగు చేసుకుని సోమవారం ఆ ప్రాంతంలో ఎర్రగరుసును వేసి చదును చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదరు కాంట్రాక్టరు తన స్వలాభం కోసం రోడ్లు వేసి చేతులు దులుపుకుని వెళ్లిపోయాడన్నారు. సీసీ రోడ్డుకు సైడు కాలువలు లేకపోవడం వల్ల కాలనీ చివరి ప్రాంతంలో రోడ్డు పక్కన గుంతలు పడి నీరు నిలిచిపోవడంతో ఇబ్బందిగా ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, దీంతో తామే మట్టిరోడ్డు వేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీం, నెట్టికంటయ్య, మాబు, బాషా, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

నల్లమలలో తమిళ కూలీ

మహానంది, జూలై 22:. దట్టమైన నల్లమల అడవిలోని గడిగుండం బీట్ పరిసరాల్లో అనుమానాస్పందంగా సంచరిస్తున్న తమిళనాడుకు చెందిన కూలీని సోమవారం అటవీశాఖ సిబ్బంది గుర్తించారు. ఆ కూలీని చాకచక్యంగా పట్టుకొని మహానంది పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ వ్యక్తికి తమిళ భాష కూడ సరిగా రాదని, మతిస్థిమితం లేని వ్యక్తి అని గుర్తించి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. ఈ విషయంపై అటవీశాఖ డీఆర్వో హైమవతిని వివరణ కోరగా.. సదరు వ్యక్తి మానసిక పరిస్థితి సరిగా లేదని గుర్తించి వదిలేశామని తెలిపారు.

జిల్లాలో పని చేయడం చాలా సంతృప్తినిచ్చింది

జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య



కర్నూలు(కలెక్టరేట్), జూలై 22: కర్నూలు జిల్లాలో పని చేయడం చాలా సంతృప్తినిచ్చిందన్ని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. సోమవారం ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో రిలీవై వెళుతున్న సందర్భంగా అధికారులను ఉద్దేశించి జేసీ ప్రసంగించారు. ఈ సందర్భంగా జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో భవిష్యత్తులో విధులు నిర్వహించే అవకాశం వస్తే తప్పనిసరిగా వినియోగించుకుంటానని అన్నారు. ఆదోని సబ్ కలెక్టర్, పత్తికొండ ఆర్డీవో, కర్నూలు ఆర్డీవో అందరూ తహసీల్దార్లు సహాయ సహకారాలు పూర్తిగా అందించారని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన బొజ్జా దశరథరామిరెడ్డి


ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాకు వినతిపత్రం ఇస్తున్న బొజ్జా దశరథరామిరెడ్డి తదితరులు

నంద్యాల క్రైం, జూలై 22 : నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాను రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులతో కలిసి బొజ్జా దశరథరామిరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు, సమస్యలు, వాటి పరిష్కారాలతో విశ్లేషణాత్మక వివరణలతో కూడిన నీటి అవగాహనే రాయలసీమకు రక్ష అనే పుస్తకాన్ని ఎస్పీకి అందజేశారు. ఎస్పీని కలిసిన బృందంలో సమితి ఉపాధ్యక్షులు వైఎస్‌రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, మహమ్మద్ పర్వేజ్, భాస్కర్‌రెడ్డి, పట్నం రాముడు తదితరులున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్

గోస్పాడు, జూలై 22 : ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు అండగా నిలబడతామని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. సోమవారం గోస్పాడులోని పార్టీ కార్యాలయంలో గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలతో కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రతి ఒక్కరితో తమ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిందని, గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందిస్తామని, పార్టీ కోసం పని చేసిన ప్రతి నాయకుడిని, కార్యకర్తను గుర్తు పెట్టుకుంటామని, వారి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, పార్టీ కోసం నిస్వార్థంగా పని చేసిన వారికి పార్టీలో తగిన గుర్తింపు లబిస్తుందని అన్నారు. త్వరలోనే మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకొని పరిష్కారం దిశగా ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు చేయించి పనులు చేయిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలని శాయశక్తుల పని చేస్తున్నారని అన్నారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశాల మేరకు సభను ఏర్పాటు చేశామని, ప్రతి కార్యకర్త ధైర్యంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా ముందుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎండీ ఫయాజ్, టీడీపీ మండల అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, శీలం బాస్కర్‌రెడ్డి, ద్వారం వీరారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, వేమారెడ్డి, హుసేని, ఓబుల్‌రెడ్డి, తులసిరెడ్డి, రామగోపాల్‌రెడ్డి, బాలీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వడ్డెరలకు భూములు కేటాయించాలి

నంద్యాల రూరల్, జూలై 22: నిరుపేద వడ్డెరలకు ఇళ్లు, భూములు కేటాయించాలని వడ్డెర సంఘ రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం వడ్డెర సంఘ ఆధ్వర్యంలో వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోస్టుకార్డు ద్వారా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేష్ మాట్లాడుతూ వడ్డెరల కులవృత్తి కుంటుపడడంతో క్వారీల్లో కూలీలుగా, వ్యవసాయ కూలీలుగా రూపాంతరం చెందారన్నారు. పట్టణాలకు వలసపోయి భవన నిర్మాణ కార్మికులుగా, ఇతరత్రా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. భూముల తవ్వకం పనుల్లో వడ్డెరలకు 20శాతం రిజర్వేషన్ కేటాయించాలని, జిల్లా కేంద్రమైన నంద్యాలలో వడ్డెర భవన్‌కు 650 చదరపు గజాల స్థలం కేటాయించాలని కోరారు. నిరుపేదలైన వడ్డెరలకు టిడ్కో గృహాలు యివ్వాలని, కుటుంబానికి 5 ఎకరములు చొప్పున బంజరు భూములను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపాల్, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు సంపంగి శివభాస్కర్, నంద్యాల మండల ఉపాధ్యక్షులు వెంకటేష్. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల బహుకరణ


ఎర్రగుడూరులో సచివాలయ సిబ్బందికి సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలను అందజేస్తున్న నాయకులు

పాములపాడు, జూలై 22: మండలంలోని ఎర్రగుడూరు గ్రామంలో సచివాలయ సిబ్బందికి సీఎం, డిప్యూటీ సీఎం చిత్ర పటాలను టీడీపీ నాయకులు అందించారు. సోమవారం గ్రామంలోని టీడీపీ మాజీ మండల కన్వీనర్ చెల్లె హరినాథరెడ్డి, సర్పంచ్ మంగమ్మబాయి, లింగేశ్‌గౌడ్, నాగర్జునరెడ్డి, నాగార్జుననాయక్, శివనాయక్, సోమశేఖర్‌నాయక్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్ర పటాలను అందించారు.

ఘనంగా గంగమ్మ తిరుణాల


వడ్డుగండ్లలో గంగమ్మ, బొల్లావు విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామప్రజలు

పాణ్యం, జూలై 22 : మండలంలోని వడ్డుగండ్లలో సోమవారం గంగమ్మ తిరుణాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం కౌలూరుకు తీసుకువెళ్లిన బొల్లావు, గంగమ్మ విగ్రహాలను ఊరేగిస్తూ సోమవారం బలపనూరుకు చేరి అనంతరం వడ్డుగండ్లకు చేరారు. అనంతరం రాత్రి కౌలూరుకు తిరిగి వెళ్లినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు మోహన్, మురార్జీదేశాయ్, రమణగౌడ్, మల్లి, సుబ్బయ్య, రాముడు, ఎల్లాకిట్టు,

విద్యార్థులకు బస్సు సదుపాయం


బస్సును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, జూలై 22: ఆత్మకూరు పట్టణ శివార్లలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం నుంచి ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించారు. ఏడాది క్రితం రద్దయిన ఈ సర్వీసును శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చొరవతో తిరిగి ప్రారంభించారు. వాస్తవానికి పట్టణ శివార్లలోని నంద్యాల రస్తాలో ఉన్న ఈ పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థులు ప్రతిరోజు ఇబ్బందులు పడేవారు. ఈ విషయం స్థానిక టీడీపీ నాయకులు గౌస్, న్యామత్, రఫీక్, ఖాజా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని ఆత్మకూరు బస్టాండ్ నుంచి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం బస్సు సర్వీసును ఏర్పాటు చేశారు. పాఠశాలకు ఆర్టీసీ నుంచి ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేయడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలతో సమావేశం

నంద్యాల టౌన్, జూలై 22 : జిల్లా వ్యవసాయ అధికారి వై.వి.మురళీకృష్ణ క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. క్షేత్ర స్థాయిలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యకలాపాలు, అమలు, పని తీరును సమీక్షించడం జరిగింది. సిబ్బందికి, రైతులకు నిరంతరం ఆదాయం పెరిగే వ్యవసాయ పద్ధతులపై సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే జిల్లాలో సాగు చేస్తున్న ప్రధాన పంటలలో ప్రకృతి వ్యవసాయ పద్దతులను అవలంబించే విధంగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో అధిక సంఖ్యలో రైతులతో ప్రకృతి వ్యవసాయం ఆచరించే విధంగా రైతులను చైతన్య పర్చాలని, ప్రకృతి వ్యవసాయ పద్దతుల ద్వారా సాగు చేసే పంటలకు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరతో వినియోగదారులు కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు అధికారులు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

న్యాయం కోసం వస్తే దాడి చేస్తారా.. ?

● ఓ గిరిజనుడి ఆవేదన


మాట్లాడుతున్న గిరిజన దంపతులు

కొత్తపల్లి, జూలై 22: కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు న్యాయం చేయాలని ఓ గిరిజనుడు వస్తే.. ఓ హెడ్ కానిస్టేబుల్ దాడి చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడాపురం గ్రామానికి చెందిన భూమణి పెద్ద బక్కన్న, భూమణి శివమ్మ దంపతులు స్థానిక పోలీస్‌స్టేషన్ ముందు విలేకరులతో మాట్లాడారు. తన కుమార్తెకు మాయ మాటలు చెప్పి తమ గూడెంకు చెందిన బలేని వెంకటేశ్వర్లు కుమారుడు రాము అనే గిరిజన యువకుడు తీసుకెళ్లి దొంగచాటున పెళ్లి చేసుకున్నాడని ఆరోపించారు. బాలికను ఎలా పెళ్లి చేసుకుంటాడని కొత్తపల్లి స్టేషన్‌కు వచ్చి తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశామని తెలిపారు. తమ కూతురును మందలించానని చెప్పారు. అయితే.. స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ అందరి ముందే తనను కొట్టాడని వారు ఆరోపించారు. తన కూతురును తీసుకెళ్లిన అతనిపై చర్యలు తీసుకోకుండా అందరి ముందు తమపై దాడి చేయడం విడ్డూరంగా ఉందని వాపోయారు. సదరు హెడ్ కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తన కూతురును మోసగించి పెళ్లి చేసుకున్న యువకుడిని శిక్షించాలని వేడుకున్నారు. ఈ విషయంపై కొత్తపల్లి ఎస్ఐ హరిప్రసాద్‌ను వివరణ కోరగా హెడ్ కానిస్టేబుల్ చేయి చేసుకోవడం తప్పు అని, ఇద్దరికి కౌన్సిలింగ్ ఇచ్చామని సమస్యను పరిష్కరించి బాధితుల కూతురును వారికి అప్పగించామని తెలిపారు.

ప్రజలు బుద్ధి చెప్పినా జగన్ తీరు మారలేదు


మాట్లాడుతున్న ఏవీఆర్ ప్రసాద్

నంద్యాల (నూనెపల్లె), జూలై 22: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు జగన్‌కు బుద్ధి చెప్పినా ఆయనలో ఎలాంటి మార్పు రాలేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, టీడీపీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. సోమవారం నంద్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంటే ఓర్వలేక జగన్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని అన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పిందంటూ ధర్నా చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్నో అరాచకాలను సృష్టించి దౌర్జన్యాలకు దాడులకు పాల్పడి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది జగన్ అండ్ కో కాదా అని ప్రశ్నించారు. టీడీపీ తోనే స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందనాయుడు, డోన్ మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు, ప్యాపిలి సబ్బయ్య పాల్గొన్నారు.

వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలి


మున్సిపల్ కమిషనర్ అనుపమకు వినపతి పత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

నందికొట్కూరు రూరల్, జూలై 22 : నందికొట్కూరు మున్సిపల్ పట్టణంలో సీజనల్ వ్యాధులు రాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మున్సిపల్ కమిషనర్ అనుపమకు వినతి పత్రం అందజేశారు. నందికొట్కూరు మున్సిపల్ పట్టణ పరిధిలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కాలనీలలో డ్రైనేజీలు సరిగా పని చేయక వర్షపు నీరు అధికంగా నిలువ ఉంటోందని, దీనివల్ల సీజనల్ వ్యాధులు వచ్చేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మారుతీ నగర్, ఇందిరా నగర్, హాజీనగర్, బైరెడ్డినగర్‌లతో పాటుగా దళిత వాడల్లో చిన్నపాటి వర్షానికే నీరు నిలుస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు సోమన్న, ఉపేంద్ర, కేశవగైడు, భాస్కర్ గైడు, మంగమ్మ, సాలమ్మ, లక్ష్మీదేవి, మేకల లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

పాణ్యం, జూలై 22 : విద్యుత్ కార్మికుని కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు సోమవారం తహసీల్దారు ఫణికుమార్‌ను కోరారు. ఈనెల 21 వతేదీన పిన్నాపురంలో విద్యుత్ విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు ప్రమాదానికి గురైన విద్యుత్ కార్మికుడు శ్రీనివాసులు కుటుంబాన్ని ఆదుకోవాలని నాయకులు రాజునాయుడు, ప్రతాప్, శివకృష్ణ తదితరులు కోరారు.

గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు అందించండి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ గిరిజన సమాఖ్య ప్రతినిధులు

నంద్యాల (కల్చరల్), జూలై 22: గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు అందించాలని ప్రజా పరిష్కార వేదికలో ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య అధ్యక్షుడు రాజునాయక్ నంద్యాల జిల్లా కలెక్టర్‌ను సోమవారం కోరారు. నంద్యాల జిల్లా గిరిజన ప్రాంతాలు, తండాల్లో, ఎరుకల ఎస్టీ కాలనీలో వర్షాకాలం మొదలైనందున వాతావరణం సరిగా లేకపోవడంతో విషజ్వరాలు వచ్చి సరైన వైద్యం అందక చాలా బాధపడుతున్నారన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాల, గురుకుల రెసిడెన్సియల్, గిరిజన బాలికల వసతి గృహాల్లో విషజ్వరాలు వస్తున్నాని అక్కడ మెడికల్ క్యాంపు నిర్వహించాలన్నారు. తిరుపతి గురుకుల రెసిడెన్షియల్‌లో 150మందికి పైగా అస్వస్థతకు గురైన విషయాన్ని, అలాగే గత సంవత్సరంలో నెరవాడ గురుకులంలో కూడా విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థుల పట్ల, గిరిజనుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి గిరిజన ప్రాంతాల్లో ప్రతి వ్యక్తికి వైద్య పరీక్షలు నిర్వహించి వారి ప్రాణాలను కాపాడాలని రాజునాయక్ కలెక్టర్‌ను కోరారు.

పంట కాల్వలు పూడ్చడంతో రైతుల ఇక్కట్లు


పాములపాడులో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతులు

పాములపాడు, జూలై 22: మండలంలోని క్రిష్ణరావుపేట గ్రామంలో నేషనల్ హైవే పనుల్లో గుత్తేదారులు పంట కాల్వలు పూడ్చడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబుకు రైతులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు సన్ని, రామక్రిష్ణ, వెంకటేశ్వరరావు, మార్కులు మాట్లాడుతూ కేసీ కెనాల్ ద్వారా ఆయకట్టుకు సాగు నీరందే 170 ఎకరాలకు సంబంధించిన పంట కాల్వలు పూడ్చి వేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పొలాలకు నీరందక పోవడంతో ఎలా జీవించాలని ప్రశ్నించారు. అధికారులు చొరవచూపి కాల్వలు ఏర్పాటు చేయించాలని కోరారు.

వైభవంగా వెండి రథోత్సవం


స్వామి, అమ్మవార్లకు రథోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు, సిబ్బంది

శ్రీశైలం, జులై 22: శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఆశీనులను జేసి ప్రత్యేక పూజలు, మంగళహారతులు జరిపి ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మహా నందీశ్వరుడికి పల్లకి సేవ


మహానందిలో పల్లకి సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, జూలై 22: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి ఆలయ వేదపండితులు మహానంధీశ్వరుని పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకిలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ఆశీనులను చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, దేవస్థానం నిత్యాన్నదాన సత్రం కురగాయల నిరంతర దాత లక్కబోయిన ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5 లక్షల చెక్కు పంపిణీ

నందికొట్కూరు రూరల్ జూలై 22 : నందికొట్కూరు మండలంలోని 10 బొళ్ళవరం గ్రామానికి చెందిన జనసేన క్రియాశీల సభ్యుడు విద్యపోగు సుంకన్న ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులకు రూ. 5 లక్షల చెక్కును సోమవారం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదేల నాగబాబు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు చింతా సేరేష్‌బాబు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి



నంద్యాల (కల్చరల్), జూలై 22: నంద్యాల జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన రాజకుమారిని నంద్యాల నియోజకవర్గ టీడీపీ మాజీఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. . ఈ సందర్భంగా నియోజక వర్గంలోని పలు విషయాలను కలెక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రజక సంఘం నాయకులు

జూపాడుబంగ్లా, జూలై 22: పాములపాడు మండలం ఇస్కాల గ్రామానికి చెందిన చాకలి లింగస్వామిని అతికిరాతంగా హత్యచేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని రజకసంఘం నాయకులు మౌలాలి, నాగభూషణం, ఎల్లయ్యలు డిమాండు చేశారు. స్థానిక జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు.

పంటలను కాపాడుకోవాలి


తాటిపాడులో మాట్లాడుతున్న ఏవో కృష్ణారెడ్డి

జూపాడుబంగ్లా, జూలై 22: అధికవర్షాలతో మొక్కజొన్న, కంది, మినుము పైర్లలో వేరుకుళ్లు, మచ్చతెగులు వచ్చే అవకాశం ఉందని రైతులు పంటలను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఏవో కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని తాటిపాడు, పారుమంచాల గ్రామాల్లో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. వర్షం తగ్గిన తర్వాత పొలాల్లో ఉన్న నీటిని కాల్వ ద్వారా తీసేసి ఎకరాకు 25కిలోల యూరియా 25కిలోలు పొటాష్ వేసుకోవాలని అన్నారు. వేరుకుళ్లు ఆశించిన మొక్కలను తొలగించి, కాపర్ ఆక్సీక్లోరైడ్ ఎకరానికి 600గ్రాములు నీటిలో కలుపుకుని మొక్కల వద్ద పోయాలని సూచించారు.

ఎత్తిపోతల ద్వారా సాగు నీరు


వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద సమావేశమైన రైతులు

జూపాడుబంగ్లా, జూలై 22: రైతులందరం జూపాడు బంగ్లా -1 ఎత్తిపోతల పథకం ద్వారా పొలాలకు కలిసికట్టుగా సాగునీరు అందించుకుందామని టీడీపీ మండల నాయకులు గిరీశ్వరరెడ్డి అన్నారు. సోమవారం జూ పాడుబంగ్లాలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద మండల తెలుగు రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఎత్తిపోతల నిర్వహణకోసం సంబందిత అధికారుల సమక్షంలో ఎత్తిపోతల పథకం నూతన కమిటీని ఎన్నికున్నారు. గౌరవ అధ్యక్షులుగా గిరీశ్వరరెడ్డి, అధ్యక్షుడిగా పెద్దన్న, ఉపాధ్యక్షులుగా మహేశ్వరరెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా రవికుమార్‌యాదవ్, సహాయకార్యదర్శిగా సైఫుద్దీన్, గౌరవ సలహాదారుగా మద్దిలేటిరెడ్డి, మద్దూరు సుధాకర్, మరో 8మంది రైతులను సభ్యులుగా ఎన్నుకున్నారు.

దివ్యాంగుల సంజీవిని 2016 చట్టం

వెలుగోడు, జూలై 22: దివ్యాంగుల సంజీవిని 2016 చట్టమని వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు అబ్దుల్ రవుఫ్, ఇంతియాజ్‌లు అన్నారు. సోమవారం దివ్యాంగుల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ6 వేల ఫించన్లను పెంచి ఇచ్చిన వాగ్దానం నెర వేర్చుకున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు దివ్యాంగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రహంతుల్లా శ్రీను, మన్సూర్ , ఖలీల్, లక్ష్మయ్య, తదిరతులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలి


సచివాలయంలో కార్యదర్శి సందీప్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

వెలుగోడు, జూలై 22: రాష్ట్రంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలని అలాగే జీవో నంబర్ 22 ను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు జిల్లా కార్యదర్శి రాజశేఖర్, వెలుగోడు రైతు సంఘం నాయకులు రమణ, సీఐటియు నాయకులు మహ్మద్ రఫి డిమాండ్ చేశారు. సోమవారం వినతి పత్రాన్ని సచివాలయ కార్యదర్శి సందీప్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ.. అతివృష్టి అనావృష్టిలో పంటలు పండక తెచ్చిన పెట్టుబడులు చేతికి రాక రైతులు నష్టాల్లో కూరుకు పోయారన్నారు. ఈ ఏడాది సైతం ముందస్తు వర్షాలతో రైతులు కొత్తగా అప్పులు చేసి పంటలు వేసుకుని రాబోయే కాలంలో వ్యవసాయానిక మంచి రోజులు వస్తాయని రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు చేసిన వాగ్దానం అమలు చేసి చేయూత కింద ప్రతి రైతు కుటంబానికి 20 వేలు ఖాతాలో జమ చేయాలన్నారు. కౌలు రైతులకు సైతం ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నారు. ఉపాధి కూలీలకు రూ600 వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతులు శివారెడ్డి, ఇలియాస్,రమణ,తదిరతులు పాల్గొన్నారు.

త్వరలో కేసికి నీరు


అచ్చెన్నానాయుడుతో ఎమ్మెల్యేలు గౌరు చరిత, జయసూర్య

నందికొట్కూరు, జూలై 22: తుంగభద్ర డ్యామ్ ఎగువ ప్రాంతంలో వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో త్వరలో కేసీ కాలువకు నీటిని విడుదల చేస్తున్నట్లు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. తుంగభద్ర డ్యామ్ నుంచి సుంకేసుల బ్యారేజీకి 50 వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండడంతో టీబీ డ్యాం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా కేసీ కాలువకు కూడా నీటిని విడుదల చేయాలని అసెంబ్లీ సమావేశంలో భాగంగా మంత్రి అచ్చెన్నానాయుడుని కలిసినట్లు ఆయన తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి మహ్మద్ బేగ్

కొత్తపల్లి, జూలై 22: ప్రస్తుతం వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి మహ్మద్ బేగ్ సూచించారు. సోమవారం మండలంలోని పాలెంచెర్వు గూడెంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు డయేరియా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, క్షయ వ్యాధి లక్షణాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ ఆయేషాభేగం, సూపర్‌వైజర్ దేవ కరుణమ్మ, గురప్ప, శైలజ, శ్రీరాములు, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలని ఎంపీడీవో శివప్రసాద్ వర్మ ఆదేశించారు. సోమవారం మండలంలోని వెంకటాపురం,సిద్దాపురం, బాపనంతాపురం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో డ్రైనేజీ మురికి గుంటలు శుభ్రం చేయడం, రహదారులపై నిలువ నీరు ఉండకుండా చూడటం, తాగునీటి ట్యాంకుల వద్ద అపరిశుభ్రత లేకుండా చూడటం వంటి చర్యలు చేపట్టారు.అలాగే త్రాగు నీటి ట్యాంకులను పరిశీలించి క్లోరినేషన్ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు

మహానంది, జూలై 22: మహానందిలో లాడ్జీలు నిర్వహించుకునే యజమానులు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం ప్రైవేట్ లాడ్జిలను ఎస్ఐ ఆకస్మికంగా తనిఖీ చేసారు. నేరచరిత్ర కల్గిన వ్యక్తులు లాడ్జీకి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల (నూనెపల్లె), జూలై 22: నంద్యాల జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి చింతామణి అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్, ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి నాగార్జున కోరారు. సోమవారం అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ని ఏఐఎస్ఏ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా అనిల్, నాగార్జున మాట్లాడుతూ..జిల్లాలోని సంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల వార్డన్లను భయభ్రాంతులకు గురి చేస్తూ కమీషన్లకు పాల్పడుతుందని ఆరోపించారు. హాస్టళ్ళలో వార్డన్లు లేని సమయంలో ఆయన తనిఖీలు చేసి వార్డన్లపై వ్యతిరేకంగా విద్యార్థులతో బలవంతంగా సంతకాలు చేయించుకుని అనేక మంది వార్డన్లను ఆమె హింసిస్తోందని ఆమె చెప్పుకొచ్చారు. అధికారికి తలొగ్గని వార్డన్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి సస్పెన్షన్ చేయించడం, సస్పెన్స్ అయిన వార్డన్లకు మళ్ళీ విధుల్లోకి తసీఉకోకుండా పోస్టింగ్‌లు ఇవ్వకపోవడం ప్రతి పనికి కమీషన్లను వసూలు చూస్తూ అక్రమాలకు ప్లాపడుతుతందని మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. వినతి పత్రం చ్చిన వారిలో మహేష్ అఖిల్, ఉన్నారు.

రోడ్డును బాగు చేయండి

కొత్తపల్లి, జూలై 22: ఆత్మకూరు నుంచి దుద్యాల వరకు గుంతలమయమైన రోడ్డును బాగు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాగరాజు, ఈర్ల రాజు సోమవారం నిర్వహించిన ప్రజావేదికలో అధికారులకు విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆత్మకూరు నుంచి దుద్యాల మీదుగా ఇస్కాల, చెలిమిల్ల, నాగంపల్లి కొక్కెరంచ, ఎదురుపాడు గ్రామాలకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. ఇటీవల దుద్యాల నుంచి ఇస్కాల వరకు ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు వేస్తామని చెప్పి ఎక్స్‌కవేటర్‌తో రోడ్డును తొలగించి మరింత గుంతలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు మద్దిలేటి, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు నాగన్న తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డోన్ నాయకులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న టీడీపీ నాయకులు

డోన్, జూలై 22: నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారిని గనియాను సోమవారం డోన్ నియోజకవర్గ టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై. నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, డోన్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల పార్టీ అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, ఏవీఆర్ ప్రసాద్, గోవిందనాయుడు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

డోన్(రూరల్), జూలై 22: మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన జనసైనికుడు సింగలపల్లి శివ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బాధిత కుటుంబానికి రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును మంగళగిరి జనసేన కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ చింత సురేష్, డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం పాల్గొన్నారు.

ఎంపీకి కీలక శాఖల బాధ్యతలపై హర్షం

డోన్(రూరల్), జూలై 22: ఎన్డీయే కూటమి తరఫున కేంద్ర పరిధిలో నంద్యాల జిల్లా ఎంపీ బైరెడ్డి శబరికి కీలక శాఖల బాధ్యతలు అప్పజెప్పడంపై డోన్ పట్టణ యువ నాయకుడు హనుమంతరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సోమ వారం ఆయన మాట్లాడుతూ విద్య, మహిళ శిశు సంక్షేమాభివృద్ధి నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి కల్పన బాధ్యతలను బైరెడ్డి శబరికి కేటాయించడం సంతోషకరమన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల ఆందోళన



ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

డోన్(రూరల్), జూలై 22: బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ డోన్‌లో న్యాయవాదులు సోమవారం కోర్టు ప్రధాన రోడ్డులో విధులను బహిష్కరించి ఆందోళనలు చేశారు. ఈ సందర్భంగా డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడు, ఐఏఎల్ రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు మాట్లాడుతూ బార్‌కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం న్యాయవాదుల మనోభావాలను భంగం కలిగించే విధంగా ఉందన్నారు. బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు కృష్ణప్రసాద్, నాగరాజు, శ్రీనివాసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజమే లక్ష్యం



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో శారదాబాయి

చాగలమర్రి, జూలై 22: కుష్ఠువ్యాధి రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి శారదాబాయి అన్నారు. సోమవారం చాగలమర్రి గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం న్యూబిల్డింగ్స్ వీధిలో ఆశా వర్కర్లు చేస్తున్న కుష్ఠువ్యాధి ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 18 నుంచి ఆగస్టు 2 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తామని అన్నారు. జిల్లాలో 1,610 టీమ్‌లతో ఇంటింటి సర్వే చేస్తున్నా మని అన్నారు. 2,290 అనుమానిత కేసులు గుర్తించామని, వాటిలో 8 కేసులు నిర్ధారణ అయ్యాయని అన్నారు. చాగలమర్రిలో 53 అనుమానిత కేసులు నమోదు చేశామన్నారు. వైద్యులు ఇమ్రాన్, సీహెచ్‌వో రమణమ్మ, హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్‌ఎం గార్లెట్, ఆశా వర్కర్ పుష్పలత పాల్గొన్నారు.

జడ్పీహెచ్‌ఎస్‌లో శిక్షా సప్తాహ్ ప్రారంభం

డోన్(రూరల్), జూలై 22: డోన్ పట్టణంలోని పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులు వివిధ కృత్యాలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిశేఖర్, వెంకటరమణ, వెంకటలక్ష్మి, సుబ్బరాయుడు, రఘునాథ్, ఎస్తేరమ్మ, శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో విశేష పూజలు

డోన్(రూరల్), జూలై 22: డోన్ పట్టణం కొండపేటలోని రేణుకా ఎల్లమాంబేశ్వరి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ సేవకుడు ఏఈ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో పలువురు భక్తులు పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. డోన్ రాజ్ థియేటర్‌కు చెందిన మల్లికార్జున గౌడు, మహేష్‌గౌడు, కేశన్నగౌడులు అమ్మవారి ఆలయాభివృద్ధికి రూ.50వేలు విరాళం అందజేశారు. గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జలదుర్గం మద్దిలేటి పాల్గొన్నారు.

విద్యుత్‌పట్ల జాగ్రత్తగా ఉండాలి

చాగలమర్రి, జూలై 22: భారీ వర్షాల నేపథ్యంలో రైతులు, ప్రజలు, వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని మండల విద్యుత్‌శాఖ ఏఈ షాజహాన్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ తీగలు, స్తంభాల వద్దకు వెళ్లకూడదని అన్నారు. రైతులు బోర్ల వద్ద విద్యుత్ మీటర్లు, తీగలను తగలరాదని, ఏదైనా ప్రమాదం జరిగితే తమ దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. గాలి, వానకు ఆయా గ్రామాల్లో విద్యుత్ తీగలు, స్తంభాలు విరిగి పడితే సమాచారం ఇవ్వాలని అన్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

అవుకు, జూలై 22: అవుకు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మల్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉదయం 10-30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో విద్య వైద్యం, వ్యవసాయం, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఉపాధి హామీతోపాటు మొత్తం 17 శాఖలపై సమీక్ష జరుగుతుందన్నారు.

లారీ యజమానుల సమస్యలు పరిష్కరిస్తా

ఆళ్లగడ్డ, జూలై 22: ఆళ్లగడ్డ లారీ యజమానుల సమస్యలను పరిష్కరిస్తానని టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్‌నాయుడు అన్నారు. సోమవారం లారీ యజమానులు మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి సన్మానించారు. ఇతర ప్రాంతాల నుంచి లారీలు రావడంతో ఉపాధి కోల్పోతున్నామని యజమానులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. లారీ అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా చర్యలు తీసుకుంటామని ఆయన సూచించారు.

శిథిలావస్థలో తహసీల్దారు కార్యాలయం

- దెబ్బతిన్న పైకప్పు దూలాలు
- వర్షం వస్తే తడిసిపోతున్న కార్యాలయం గదులు
- పట్టించుకోని అధికారులు

ప్యాపిలి, జూలై 22: స్థానిక తహసీల్దారు కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైకప్పు దూలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. చిన్న వర్షం వచ్చిన కార్యాలయంలోని అన్ని గదులు తడిసిపోతున్నాయి. వర్షపు నీరు పడకుండా డబ్బాలు పెట్టి కాలం వెళ్లదీస్తున్నారు. ఇంత దుస్థితిలో ఉన్నా మరమ్మతుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ప్యాపిలి తహసీల్దారు కార్యాలయాన్ని బ్రిటీష్ కాలంలో నిర్మించారు. దాదాపు 4ఎకరాల విశాల మైదానంలో ఆనాటి పద్ధతిలో బ్రిటీష్ వారు ఈ భవనాన్ని నిర్మించారు. విశాలమైన గదులతో పాటు గాలి, వెలుతురు కోసం పెద్ద పెద్ద కిటికీలు, తలుపుల నిర్మాణాలు చేపట్టారు. దీంతో వేసవిలో సైతం చల్లటి వాతావరణం ఉండేలా కార్యాలయం ఆవరణలో వివిధ రకాల చెట్లను పెంచారు. అయితే ప్రస్తుతం కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంటుంది. భవనం పైకప్పు దూలాలు పూర్తిగా విరిగిపోయాయి. వర్షం వస్తే కార్యాలయంలోకి వర్షపు నీరు చేరుతుండటంతో రికార్డులు తడిసి పోతున్నాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దారు కార్యాలయానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కార్యాలయ సిబ్బంది, గ్రామస్థులు కోరుతున్నారు.



వర్షపు నీరు పడకుండా డబ్బాలు ఏర్పాటు చేసిన సిబ్బంది



దెబ్బతిన్న కార్యాలయం పైకప్పు దులాలు

రేషన్ దుకాణంలోని సరుకులు సీజ్



అక్రమంగా నిల్వ ఉంచిన స్టాక్‌ను సీజ్ చేస్తున్న ఆర్ఐ రాముడు

అవుకు, జూలై 22: మండలంలోని రామాపురం గ్రామంలోని షాపు నెంబర్ - 1 రేషన్ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన సరుకులను సీజ్ చేసినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాముడు సోమవారం తెలి పారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఈ రేషన్ దుకా ణంలో 633 రేషన్ కార్డులు ఉండగా 400 రేషన్ కార్డుదారులకు మాత్రమే సరుకులు పంపిణీ చేసినట్లు ఫిర్యాదులు అందటంతో తనిఖీ చేశామన్నారు. 98శాతం రేషన్ సరుకులు పంపిణీ చేయాల్సి ఉన్నా కేవలం 70శాతం మాత్రమే పంపిణీ చేసి మిగతా స్టాక్‌ను నిల్వ చేశారన్నారు. ఈ తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 2,280 కేజీలు పీడీఎస్ బియ్యం గుర్తించి సీజ్ చేశామన్నారు. అలాగే 2కేజీ రాగిపిండి, 1కేజీ రాగులు రేషన్ దుకాణంలో లేవన్నారు. వీఆర్‌వో ఓబులేసుతో కలిసి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టీబీ ప్రాణాంతక వ్యాధి కాదు

ఆళ్లగడ్డ, జూలై 22: టీబీ (క్షయ) ప్రాణాంతక వ్యాధి కాదని డిప్యూటీ డీఎంహెచ్‌వో శారదాబాయి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆమె సోమవారం తనిఖీ చేశారు. ప్రజలకు వ్యాధి నివారణపై అవగాహన కల్పించాలని ఆమె వైద్య సిబ్బందిని ఆదేశించారు.

యాగంటిలో పల్లకీ సేవ



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, జూలై 22: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీసేవ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితోపాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగిం చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

స్పెషల్ ఆధార్ క్యాంపును వినియోగించుకోండి

అవుకు, జూలై 22: మండలంలోని సచివాలయాల్లో స్పెషల్ ఆధార్ అప్‌డేట్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మల్‌రెడ్డి సోమవారం తెలి పారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మంగళవారం నుంచి 27వ తేదీ వరకు స్పెషల్ ఆధార్ క్యాంపును నిర్వహిస్తున్నామన్నారు. ఇంటి అడ్రస్, జిల్లా, పేర్లలో సవరణలు, తదితర మార్పులు చేసుకోవచ్చన్నారు. అలాగే చిన్న పిల్లలకు కొత్త ఆధార్ కార్డులను పొందవచ్చన్నారు. 23వ తేదీన రామాపురం, చెన్నంపల్లె, అన్నవరం, 24న చెర్లోపల్లె, సుంకేసుల, మంగంపేట, 25న అవుకు 1, 2, 3 సచివాలయాలు, చనుగొండ్ల, ఉప్పలపాడు, 26న మెట్టుపల్లె, శింగన పల్లె, కునుకుంట్ల, ఉప్పలపాడు, 27న గుండ్లశింగవరం, సంగపట్నం, కొండ మనాయునిపల్లె సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు తెలి పారు.

సంజామల: ఈ నెల 23 నుంచి 27 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో విజయ్ కుమార్ రెడ్డి సోమవారం తెలిపారు. ఐదు రోజుల పాటు గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. ఆధార్‌లో చిరునామా సవరణ, ఫోన్ నెంబరు లింకు చేయడం తదితర సవరణలు డిజిటల్ అసిస్టెంట్లు చేస్తారన్నారు. ఈనెల 23న కానాల, 24 గిద్దలూరు, 25న ఆర్. లింగందిన్నె, 26న ఆకుమళ్ల, 27న ముక్కమల గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేశామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

పేకాట నిర్వాహకులపై చర్యలు

- 8మంది అరెస్ట్
- రూ.12,430 నగదు స్వాధీనం

కొలిమిగుండ్ల, జూలై 22: మండలంలోని వివిధ గ్రామాల్లో పేకాట నిర్వహణపై కఠిన చర్యలు చేపడతామని కొలిమిగుండ్ల సీఐ గోపీనాథ్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండలంలోని తిమ్మనాయినిపేట గ్రామ సమీపంలో కుంట వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడిచేసి 8 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.12430 నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు సీఐ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విష్ణు పారాయణం

చాగలమర్రి, జూలై 22: చాగలమర్రి గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో ఆషాడమాసం సందర్భంగా సోమవారం మహిళలు సామూహికంగా భక్తిశ్రద్ధలతో విష్ణుపారాయణం చేశారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పండ్లు, కూరగాయలు, ఆకులతో పార్వతిదేవిని శాకంబరి అలంకారంలో కొలువుదీర్చి పూజలు చేశారు.

వైభవంగా గౌస్‌పీర్‌షా ఖాద్రి ఉరుసు



ఫాతెహాలు చేస్తున్న ముస్లింలు

చాగలమర్రి, జూలై 22: చాగలమర్రిలోని చిన్నమకానం వీధిలో వెలసిన సయ్యద్ గౌస్‌పీర్‌షా ఖాద్రి ఉరుసు ఉత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ లాల్‌మియాషా ఖాద్రి ఆధ్వర్యంలో దర్గా వద్ద ఫాతెహాలు చేశారు. కార్యక్రమానికి కమలాపురం దర్గా పీఠాధిపతి సయ్యద్‌మౌలానషా ఖాద్రి పాల్గొన్నారు. దర్గాలో గంధం సమర్పించి ఫాతె హాలు చేశారు. కార్యక్రమంలో స్వామివారి శిష్యులు రామచంద్రుడు, శేఖర్, రజాక్, ఉసేన్‌వలి పాల్గొన్నారు.

నర్సిపల్లెలో జియారత్ వేడుకలు



స్వాముల వారికి ఫాతేహాలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ, జూలై 22: మండలంలోని నర్సిపల్లె గ్రామంలో సోమవారం జియారత్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుండి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుండి మౌలాలి, దస్తగిరి స్వాములకు మేళ, తాళాల మధ్య గ్రామోత్సవం చేశారు. ఇంటింటి స్వాముల వారు వెళ్లగానే భక్తులు ప్రత్యేక ఫాతేహాలు చేశారు. ఉదయం 10 గంటలకు స్వాములు వారిని తిరిగి చావిళ్లలో కొలువుంచారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఆళ్లగడ్డ, జూలై 22: ఉయ్యాలవాడ మండలం బోడెమ్మనూరు గ్రామస్థులు నిర్మించుకుంటున్న ఆలయ నిర్మాణానికి టీడీపీ యువ నాయకుడు భూమా విఖ్యాత్‌రెడ్డి సోమవారం ఆళ్లగడ్డ పట్టణంలోని ఆయన స్వగృహంలో విరాళం అందించారు. ఎన్నికల సమయంలో ఆలయ నిర్మాణానికి విరాళం ఇవ్వాలని గ్రామస్థులు కోరిన మేరకు విరాళం ఇచ్చారు.

మహిళపై దాడి.. 14 మందిపై కేసు

రుద్రవరం, జూలై 22: టీడీపీకి ప్రచారం చేస్తావా అంటూ వైసీపీ నాయకులు కార్యకర్తలు రుద్రవరం మండలం ఎల్లావత్తుల గ్రామానికి చెందిన పార్శ శివమ్మపై మే 15న దాడి చేశారని బాధితురాలు సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి తెలిపారు. తనను కాళ్లు, చేతులతో కొట్టి మూగగాయాలు చేశారని ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు శివుడు, నరస య్య, సుబ్బలక్ష్మమ్మ, హరి, పుల్లయ్య, లక్ష్మీదేవి, మరో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

కొలిమిగుండ్ల, జూలై 22: మండలంలోని ఉమ్మాయిపల్లె గ్రామ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామం నుండి సుమారు 50మంది విద్యార్థులు పెన్నా సిమెంటు పరిశ్రమలో పాఠశాలకు వెళుతున్నారని, బస్సు సౌకర్యం లేక పోవడంతో విద్యార్థులు కష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. ఈమేరకు గ్రామ నాయకులు గోపాల్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు మంత్రి బీసీ జనార్దనరెడ్డి దృష్టికి తీసుకవెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు సోమవారం తాడిపత్రి డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.

పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలి

బనగానపల్లె, జూలై 22: జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్యకు భారతరత్న బిరుదు ఇవ్వాలని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. సోమవారం మండలంలోని పలుకూరు గామంలో జాతీయ జెండాను రాజ్యాంగ సభ ఆమోదించిన దినాన్ని పురస్కరించుకొని జెండి విశిష్టత, దేశభక్తిపై అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండ్ల రమణారెడ్డి, అల్లె రామకృష్ణారెడ్డి, దూదీపీరా, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం

బేతంచెర్ల, జూలై 22: మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ జీవన్ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను వివిధ శాఖల అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వెంకట రంగ నాయక్, నగర పంచాయతీ కమిషనర్ రమేష్‌బాబు, ఏఈ గణేష్, రాజశేఖర్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధమ్మ, ఈశ్వరమ్మ తిప్పమ్మ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే సమస్యల పట్ల సత్వరమే స్పందించి పరిష్కారం చూపాలని ఎంపీడీఓ ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ సునితా బాయి, ఏఓ భూమా జ్యోతి, ఏపీవో గంగన్న, ఆర్‌డబ్ల్యూయుఎస్ ఏఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

చాగలమర్రి: సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం కొత్తగా మీకోసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రమణమ్మ, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతి పత్రాలను స్వీకరిం చారు. ఎంఈవో అనూరాధ, సూపర్‌వైజర్ సుశీల, ఏవో రంగనేతాజీ, ఏఈలు షాజహాన్, షఫివుల్లా, జగ్గయ్య, కొండారెడ్డి, ఏపీవో నిర్మల, ఏపీఎం నాగమ్మ పాల్గొన్నారు.

సామాజిక భద్రతపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు

బనగానపల్లె, జూలై 22: బనగానపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలు- సామాజిక భద్రత అన్న అంశంపై విద్యార్థులకు సోమవారం బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు అవగాహన కల్పించారు. విద్యార్థుల సదస్సులో సీఐ మాట్లాడుతూ చెడు వ్యసనాల వల్ల కలిగే దుష్పలితాలను క్షుణ్ణంగా వివరించారు. పొగ తాగడం, గుట్కా, మద్యం సేవించడం, గంజాయికి బానిసలు కావడం, డ్రగ్స్‌కు బానిస కావడం వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణరావు, మాధవస్వామి పాల్గొన్నారు.

దివ్యాంగ చట్టాలను అమలు చేయాలి

కోవెలకుంట్ల, జూలై 22: దివ్యాంగ చట్టాలను అమలు చేయాలని నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాకు నంద్యాల జిల్లా వికలాంగుల జిల్లా జేఏసీ నాయకుడు దేవరాజు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీతో మాట్లాడుతూ వికలాంగుల చట్టం 2016ను అమలు చేయాలని కోరారు. వికలాంగులతో సమావేశం ఏర్పాటు చేసి వారిని అన్ని విధాలా ఆదుకుంటామని ఎస్పీ చెప్పినట్లు దేవరాజు తెలిపారు.

ఎస్పీని కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

ప్యాపిలి, జూలై 22: నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణాను సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో గత ప్రభుత్వంలో వైసీపీ అరాచకాలను ఎస్పీకి వివరించినట్లు నాగేశ్వరరావుయాదవ్ తెలిపారు. దీంతో అన్ని కేసులపై విచారణ చేస్తామని ఎస్పీ చెప్పినట్లు తెలిపారు. ఎస్పీని కలసిన వారిలో టీడీపీ నాయకులు ఏవీఆర్ ప్రసాద్, గోవిందనాయుడు, కృష్ణయాదవ్ ఉన్నారు.

కౌలు రైతులకు సహకరించండి

సంజామల, జూలై 22: మండలంలోని భూస్వాములు కౌలు రైతులకు సహకరించాలని వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి కోరారు. సోమవారం సంజామల ఆర్‌బీకేలో కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వాములు వారి భూములను కౌలుకు ఇస్తున్నట్లు కౌలు రైతులకు లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలన్నారు. కౌలు కార్డు పొందిన వారికి వ్యవసాయ సంబంధిత రాయితీలు వర్తిస్తాయన్నారు.

జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు

చాగలమర్రి, జూలై 22: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆళ్లగడ్డ నియోజకవర్గ జనసేన నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి, ఇరిగెల సూర్యనా రాయణరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం చాగలమర్రి గ్రామంలో క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జనసేన నాయకులు కె.అబ్దుల్లా, సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. జనసేన సభ్యత్వ నమోదు పొందిన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు షబ్బీర్, బాష, కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

ఉయ్యాలవాడ, జూలై 22: గృహ నిర్మాణాలు త్వరగతిన పూర్తి చేయాలని డీఈ నాగరాజు తెలిపారు. సోమవారం ఆయా గ్రామల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులతో ఎంపీడీవో రఘురామ్‌తో కలిసి ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ డివిజన్‌లోని ఐదు మండలాల్లో 12,462 గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 5,896 గృహ నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. 3,742 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహింధర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్యాపిలి, జూలై 22: పట్టణంలోని బీసీ కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఉల్లి రాంబాబు కుటుంబానికి భవన నిర్మాణ కార్మిక సంఘం రూ.72వేలు ఆర్థిక సాయం అందజేసింది. సోమవారం సంఘం నాయకులు మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు. నాయకులు మద్దిలేటి, మధు. నీలేంద్ర, నరసింహ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

కొలిమిగుండ్ల, జూలై 22: శాంతినగర్‌లోని ఓ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించినట్లు గ్రామ సర్పంచ్ శివరాముడు సోమవారం తెలిపారు. కొంత మంది రజకులకు నీరు రావడంలేదని ఫిర్యాదు చేయడంతో వెంటనే మరమ్మతులు చేపట్టి, కొళాయిలకు నీటి సరఫరా చేపట్టాని సర్పంచ్ వెల్లడించారు.

జీవం లేని సాగు

- పెరిగిన రసాయన ఎరువుల వాడకం
- సహజత్వాన్ని కోల్పోతున్న నేలలు
- నష్టపోతున్న అన్నదాతలు
- పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు

కొలిమిగుండ్ల, జూలై 22: గేదెలపేడ .. మేకల ఎరువు .. నల్ల మట్టి .. కోళ్లపెంట .. కుళ్లిన మొక్కలు .. ఇలాంటి సేంద్రియ ఎరువులే ఒకప్పుడు పంటల సాగులో ప్రధానంగా ఉండేవి. దీంతో భూముల్లో సేంద్రియ కర్బనం ఉత్పత్తి ఎక్కువగా ఉండేది. కార్బన్-నత్రజని 1:4 శాతంలో సమతుల్యంగా ఉండేవి. జీవ సంబంధమైన వానపాము, సాలె పురుగు, అర్రిద పురుగు, గొల్లభామ, కందిరీగ, తూనిగ, సీతాకోకచిలుక, రైజోబియం బ్యాక్టీరియా తదితర అనేక జీవులు భూసారాన్ని వృద్ధి చేస్తాయి. పంటలను చీడపీడల బారి నుంచి సంరక్షిస్తాయి. అధిక పోషక విలువలతో పంటల దిగుబడి అధికంగా ఉండేది. కానీ నేటి పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారిపోయాయి. 20వ శతాబ్దంలో వచ్చిన హరిత విప్లవం తర్వాత అధిక దిగుబడే ప్రధాన లక్ష్యంగా రసాయనిక ఎరువుల ప్రాధాన్యత పెరిగింది. దీంతో సేంద్రియ ఎరువుల వాడకం పూర్తిగా తగ్గిపోయింది. మోతాదుకు మించి రసాయనిక ఎరువుల వాడకం పెరగడంతో భూమిలో సేంద్రియ కర్బనం తగ్గిపోయింది. దీంతో రైతులు నాణ్యమైన పంటలు పండించడంలో విఫలమయ్యారు. ఈ సమస్యపై రైతన్నలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. భవిష్యత్తులో వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు నెలకొంటున్నాయనే ఆందోళన మొదలైంది.

సేంద్రియ సాగుపై అవగాహనా లేమి: పంట పొలాల్లో సేంద్రియ ఎరువుల వాడకంతో పెట్టుబడి ఖర్చులు తగ్గించాలని, ఎరువుల అవశేషాలు లేని నాణ్యమైన పంటలను పండించేలా రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు చేపడుతున్నాయి. అయినా ఫలితం కానరావడం లేదు. పొలంబడి, రైతు చైతన్యయాత్రలు, సాగుకు సమాయత్తం, రైతు భరోసా కేంద్రాలు మొక్కుబడిగా పని చేస్తున్నాయి. రైతు అవగాహన సదస్సులను అయిందనిపిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో నేటికీ 20 శాతం మంది రైతులు కూడా భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేయడంలేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా వుందో అర్థమవుతోంది. కొంత మంది రైతులు అరకొరగా మాత్రమే పశువుల పేడ, నల్లమట్టి లాంటి సేంద్రియ ఎరువులు వాడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రైతులకు సేంద్రియ ఎరువులపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రసాయన ఎరువులతో నష్టాలు: అతిగా రసాయన ఎరువుల వాడుతుండటం వల్ల కాలక్రమేణా మేలుచేసే సూక్ష్మజీవులు అంతరించి పోతున్నాయి. తద్వారా దుష్ఫలితాలు కలుగుతున్నాయి. పంటలకు చీడపీడలు వ్యాపించి, పండే పంటలు సైతం కలుషితంగా మారుతున్నాయి. రైతులు సేంద్రియ ఎరువుల వాడకం తగ్గించి, రసాయన ఎరువుల వాడకం ఇదే మోతాదులో పెంచుకుంటూ పోతే భవిష్యత్తులో భూములు వ్యవసాయానికి పనికి రాకుండా పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



సేంద్రియ ఎరువులతో లాభాలు: సేంద్రియ ఎరువులు వాడితే నేలలు సహజత్వాన్ని కోల్పోకుండా ఉంటాయి. నేల ఉత్పాదకతకు కావాల్సిన అనుకూల లక్షణాలు పెరుగుతాయి. మొక్కకు కావాల్సిన పోషకాలు పుష్కలంగా లభ్యమవుతాయి. పోషకాల సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుంది. పలురకాల ఎంజైములు, హార్మోన్లు, అమైనో అమ్లాలు తయారై మొక్క చురుకుగా పెరగడానికి తోడ్పడతాయి. తద్వారా నాణ్యమైన అధిక దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.